# సాక్షి నిర్మల్

శుక్రవారం । 30 । జూన్ । 2023






### విజయం మీదే..

గ్రూప్–4 పరీక్ష శనివారం జరుగనుంది. సరైన వ్యూహంతో పరీక్ష రాస్తే ప్రభుత్వ కొలువును ఈజీగా సాధించవచ్చని పోటీ పరీక్షల నిపుణులు పేర్కొంటున్నారు. 8లో▸



### పండుగపూట విషాదం

బక్రీద్ పండుగ వేళ కడెం మండల కేంద్రంలో విషాదం నెలకొంది. ఇద్దరు ముస్లిం యువకులు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. ఇద్దరూ చిన్ననాటి మిత్రులు. 8లో▸

### వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.3 /26.3

ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమౌతుంది. మధ్యాహ్నం వేడి, ఉక్కపోతగా ఉంటుంది. సాయంత్రం అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### సాయిచంద్ మృతి బాధాకరం



మాట్లాడుతున్న మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి

నిర్మల్‌టౌన్: రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్, ప్రముఖ గాయకుడు సాయిచంద్ హఠాన్మరణం చాలా బాధాకరమని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో గురువారం మాట్లాడుతూ.. సాయిచంద్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు మనో ధైర్యం ఇవ్వాలని, ఆయన ఆత్మకు శాంతి కలగాలని భగవంతున్ని ప్రార్థించారు. సాయిచంద్ కుటుంబానికి బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని పేర్కొన్నారు.

### గ్రూప్-4 పరీక్షకు ప్రత్యేక బస్సులు

నిర్మల్‌టౌన్: జూలై 1న జరగనున్న గ్రూప్–4 పరీక్షకు ఆయా మండలాల నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతుందని నిర్మల్ డిపో మేనేజర్ సాయన్న తెలిపారు. భైంసా, ఖానాపూర్‌కు కూడా బస్సులు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష రాసే అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### అవినీతిపై చర్చకు సిద్ధం



సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్‌లు

ఖానాపూర్: మున్సిపాలిటీలో అవినీతి అక్రమాలు జరగడంతోపాటు అభివృద్ధి కుంటుపడుతుందనే 9 మంది కౌన్సిలర్లు చైర్మన్‌పై అవిశ్వాసం నోటీసు ఇచ్చారని కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ చిన్నంసత్యం, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు పరిమి సురేశ్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాయిని సంతోష్ తెలిపారు. పట్టణంలోని విశ్రాంతి భవనంలో గురువారం మాట్లాడారు. అవినీతి ఆరోపణలు చేస్తే పరువునష్టం కేసు పెడతామంటున్న చైర్మన్ అవినీతి జరుగలేదని నిరూపించుకునేందుకు బహిరంగ చర్చకు రావాలన్నారు. ప్రజలపక్షాన నిలిచి అవిశ్వాసం పెట్టిన రోజే తాము నైతికంగా విజయం సాధించామని తెలిపారు. అవినీతి, అక్రమాలు కప్పిపుచ్చుకోవాలని, అవిశ్వాసం నెగ్గలేకే చైర్మెన్ కోర్టు నుంచి స్టే తెచ్చుకున్నారని విమర్శించారు. కొద్ది రోజుల క్రితం రూ.3.50 లక్షల బిల్లులు తీసుకున్నారని, ఆ పనులు ఎక్కడ చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. డంపింగ్‌యార్డు పూర్తి కాకున్నా కాంట్రాక్టర్ గత కలెక్టర్ బంధువని ముందస్తుగా బిల్లులు చెల్లించింది నిజం కాదా అని ప్రశ్నించారు. చైర్మన్ వైఫల్యంతో రూ.40 లక్షలతో నిర్మించాల్సిన వైకుంఠధామం రూ.70 లక్షలకు చేరిందన్నారు. మిషన్ భగీరథ పనులు పూర్తికాకున్నా.. చేపిన పనుల్లో నాణ్యత లోపించినా రూ.8 కోట్ల చెల్లింపుపై విచారణ చేయాలని డిమాండ్ చేశారు. అవిశ్వాసంపై వెనక్కి తగ్గే ప్రసక్తేలేదని స్పష్టం చేశారు. సమావేశంలో కౌన్సిల ర్లు, నాయకులు కావలి సంతోష్, తొంటి శ్రీని వాస్, షబ్బీర్‌పాషా పాల్గొన్నారు.




భైంసాలో ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

ముస్లింలు బక్రీద్(ఈదుల్ అజ్ హా)ను జిల్లాలో భక్తిశ్రద్ధలతో గురువారం జరుపుకున్నారు. ఉదయమే ఈద్గాల వద్దకు చేరుకున్న ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. త్యాగానికి ప్రతీకగా భావించే భక్తి పండుగ విశిష్టత గురించి ముస్లిం మత పెద్దలు ప్రబోధించారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్నారు. తమ మిత్రులు, బంధువులకు కుర్బానీ అందించారు. జిల్లా కేంద్రంలోని ఈద్గా వద్దకు మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి చేరుకుని ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, డీసీసీబీ మాజీ చైర్మన్ రాంకిషన్‌రెడ్డి, ఎఫ్‌ఎస్‌సీఎస్ చైర్మన్ రాజేందర్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు రాము తదితరులు ఉన్నారు. భైంసా గడ్డెన్నవాగు ప్రాజెక్టు సమీపంలోని ఈద్గాలో ముస్లింలు ప్రార్థనలు చేశారు. అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. - నిర్మల్‌టౌన్



బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి



శుభాకాంక్షలు తెలుపుకుంటున్న చిన్నారులు




భక్తి శ్రద్ధలతో భజనలు చేస్తున్న భక్తులు, మహిళలు

భైంసాటౌన్/నిర్మల్‌టౌన్: తొలి ఏకాదశి సందర్భంగా జిల్లాలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచే ప్రజలు దైవదర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా కేంద్రంలోని హరిహర క్షేత్రం మల్లన్నగుట్ట ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయ ధర్మకర్తలు అల్లోల వినోదమ్మ-మురళీధర్‌రెడ్డి దంపతులు స్వామివారికి నూతన వస్త్రాలు సమర్పించారు. 108 కలశాలతో పంచామృతాభిషేకం నిర్వహించారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సతీమణి విజయలక్ష్మి కూడా స్వామివారిని దర్శించుకున్నారు. భైంసా పట్టణంలో విఠలేశ్వరుని భక్తులు ఉపవాస దీక్షలు చేపట్టారు. మార్వాడి సంఘం ఆధ్వర్యంలో భైంసాలోని మార్వాడి గల్లిలోని సంఘ భవనం నుంచి గోశాల వరకు ప్రభాత్‌భేరీ నిర్వహించారు. చిన్నారులకు విఠలేశ్వరుడు, రుక్మిణి, సంత్ తుకారాం, జ్ఞానేశ్వర్ మహారాజ్ వేషధారణతో మహిళలు, భక్తులు వీధుల్లో విఠల నామస్మరణతో భజనలు చేశారు.

# పోడు రైతులకు 'పట్టా'భిషేకం

- లబ్ధిదారుల జాబితా సిద్ధం
- పకడ్బందీగా అర్హుల గుర్తింపు
- నేడు ఆసిఫాబాద్ జిల్లాలో శ్రీకారం చుట్టనున్న సీఎం
- జిల్లాలో పండుగ వాతావరణంలో పంపిణీకి అధికారుల ఏర్పాట్లు



నిర్మల్ చైన్‌గేట్: దశాబ్దాల తరబడి పోడు భూములను సాగు చేసుకుంటున్న రైతులకు హక్కు పత్రాలు అందనున్నాయి. ఈనెల 30న పోడు పట్టాలు పంపిణీ చేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించారు. ఏడాదికి పైగా కసరత్తు చేసి తుది జాబితాను సిద్ధం చేశారు. అన్ని జిల్లాల్లో సభలు, సమావేశాలు పెట్టి పండుగ వాతావరణంలో పోడు పట్టాలు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది.

**2005 కంటే ముందు సాగులో ఉన్న వారికే..**

అటవీ భూముల్లో సేద్యం చేసుకుంటున్న వారికి పోడు భూములపై హక్కులు(రికగ్నైజేషన్ ఆఫ్ ఫారెస్ట్ రైట్స్ – ఆర్‌ఓఎఫ్ ఆర్) కల్పించేందుకు 2021, నవంబరు 8వ తేదీ నుంచి డిసెంబరు 8వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది. 2005 కంటే ముందు సాగులో ఉన్నవారు అర్హులని పేర్కొంది. జిల్లా వ్యాప్తంగా 14,666 మంది దరఖాస్తు చేసుకున్నారు. 2022లో వాటికి సంబంధించిన సర్వే నిర్వహించారు. గ్రామసభలు నిర్వహించి అర్హులను గురించారు. దాదాపు గ్రామస్థాయిలోనే ఫారెస్ట్ రైట్స్ కమిటీలే(ఎస్‌ఆర్సీ) అర్హులను గుర్తించాయి. వారు గుర్తించిన జాబితాను ఆర్డీవో స్థాయిలో సబ్ డివిజన్ లెవల్ కమిటీకి(ఎస్‌ఎల్సీ) పంపగా వారంతా స్క్రూటినీ చేసి కలెక్టర్ ఆధ్వర్యంలోని జిల్లా స్థాయి కమిటీ(డీఎల్సీ)కి పంపించారు. ఇందులో నుంచి 5,204 మంది అర్హులని తేల్చారు.

**పకడ్బందీగా జాబితా..**

జిల్లాలోని 18 మండలాలు ఉండగా.. 13 మండలాల్లో పోడు భూముల సమస్య ఉంది. ఈ మేరకు రైతుల దరఖాస్తుల పరిశీలన, తుది జాబితా తయారీ వరకు అంతా పకడ్బందీగా చేపట్టారు. ఏ మండలంలో ఎంత మంది రైతులకు పట్టాలు ఇస్తున్న విషయాన్ని గోప్యంగా ఉంచారు. కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేకసెల్ ఏర్పాటు చేసి అదనపు కలెక్టర్, ఆర్డీవోల పర్యవేక్షణలో తహసీల్దార్లు ప్రతీ దరఖాస్తును పరిశీలించారు. ఒక గ్రామానికి చెందిన దరఖాస్తులు పరిశీలిస్తుంటే.. ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శిని పిలిపించి అనుమానాలు నివృత్తి చేసుకున్నారు. పలు అంశాలను పరిగణనలోకి తీసుకుని తుది జాబితా తయారు చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

**సభలు ఏర్పాటు చేసి పంపిణీ..**

సభలు, సమావేశాలు ఏర్పాటు చేసి పండుగ వాతావరణంలో గిరిజనులకు పోడు పట్టాలు పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇందులో భాగంగా ప్రతీ జిల్లాలో బహిరంగసభ ఏర్పాటు చేసి నాయకుల చేతుల మీదుగా పట్టాలు పంపిణీ చేయనున్నారు. ఈమేరకు ఈనెల 30న ఆసిఫాబాద్ పర్యటనలో పట్టాలు అందజేసి ఈ కార్యక్రమానికి సీఎం కేసీఆర్ శ్రీకారం చుట్టనున్నారు.

**మండలాల వారీగా గుర్తించిన లబ్ధిదారుల వివరాలు..**

| మండలం పేరు | లబ్ధిదారుల సంఖ్య |
|---|---|
| మామడ | 1,251 |
| పెంబి | 1,065 |
| సారంగాపూర్ | 734 |
| కడెం | 728 |
| దస్తురాబాద్ | 426 |
| ఖానాపూర్ | 382 |
| కుభీర్ | 281 |
| తానూరు | 126 |
| నర్సాపూర్(జి) | 63 |
| నిర్మల్ రూరల్ | 32 |
| కుంటాల | 10 |
| లక్ష్మణచాంద | 4 |
| దిలావర్‌పూర్ | 1 |

### నేడు డయల్ యువర్ డీఎం

నిర్మల్‌టౌన్: నిర్మల్ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ సాయన్న తెలిపారు. డిపో పరిధిలోని గ్రామాలు, పట్టణ ప్రాంత ఆర్టీసీ ప్రయాణికులు బస్సు సమయాలు, నూతన రూట్ల గురించి తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. ఏవైనా సలహాలు, సూచనలు ఇవ్వొచ్చని తెలిపారు. శుక్రవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు 99592 26003 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

### మేకల మందపై చిరుత దాడి



చిరుత దాడిలో గాయపడ్డ మేక

కుంటాల: మండలంలోని దౌనెల్లి అటవీ ప్రాంతంలో చిరుత సంచారం కలకలం రేపింది. గురువారం ఉదయం గ్రామానికి చెందిన శీలం దిగంబర్ రోజు మాదిరిగానే మేకల మందను మేత కోసం అటవీ ప్రాంతానికి తీసుకెళ్లాడు. అకస్మాత్తుగా చిరుత మేకల మందపై దాడి చేయడంతో ఒక మేక తీవ్రంగా గాయపడింది. అప్రమత్తమైన దిగంబర్ కేకలు వేయడంతో చిరుత అక్కడి నుంచి పారిపోయింది. చిరుత సంచారంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

**'పల్సి'లో చిరుత సంచారం..**

కుభీర్: మండలంలోని పల్సి గ్రామ పరిసరాల్లో గురువారం సాయంత్రం 6 గంటలకు చిరుత కనిపించిందని గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన రైతు భుమన్న చేను వద్ద ఉండగా చిరుత కనిపించడంతో పరిగెత్తుకుంటూ రోడ్డుకు చేరారు. అక్కడ ఉన్న కొందరితో కలిసి కేకలు వేయడంతో చిరుత పారిపోయింది. విషయం సర్పంచ్ కవిత దృష్టికి తీసుకెళ్లగా ఆమె అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. అటవీ సిబ్బంది గ్రామానికి చేరుకున్నారు. చిరుత సంచరించిన ప్రాంతాలను పరిశీలించామని సెక్షన్ ఆఫీసర్ జాదవ్ కోటేషన్ తెలిపారు.

# గ్రూప్-4 పరీక్షకు సర్వం సిద్ధం

- రేపే పరీక్ష
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- జిల్లాలో 54 సెంటర్లు
- పరీక్ష రాయనున్న 15,475 మంది అభ్యర్థులు

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ) ఆధ్వర్యంలో జూలై ఒకటిన నిర్వహించనున్న గ్రూప్–4 పరీక్షకు అధికారులు ఏర్పాట్లు చేశారు. అభ్యర్థుల హాల్‌టికెట్లను ఈనెల 24 నుంచి ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయి. మరోవైపు జిల్లా యంత్రాంగం సెంటర్ల వారీగా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. బుధవారం జిల్లాలోని లైజనింగ్ ఆఫీసర్లతోపాటు రూట్ ఆఫీసర్లు(తహసీల్దార్లు) జిల్లా పరిధిలో ఏర్పాటు చేసిన సెంటర్లను పరిశీలించారు. పరీక్ష నిర్వహణకు సంబంధించి ప్రొఫార్మాను పూర్తి చేసి సంబంధిత అధికారులకు అప్పగించారు.

**పకడ్బందీగా ఏర్పాట్లు..**

టీఎస్‌పీఎస్సీ ఎంట్రన్స్ పేపర్ల లీకేజీ నేపథ్యంలో ఈసారి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించడానికి చర్యలు చేపట్టారు. సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు జరుగనున్నాయి. పరీక్ష రాసే అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకునేలా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. సాంకేతిక పరమైన సమస్యలు తలెత్తకుండా టెక్నికల్ డిపార్టుమెంటుకు బాధ్యతలను అప్పగించారు. ప్రశ్నపత్రాలను భద్రపర్చడం.. తిరిగి సెంటర్లకు తరలించే క్రమంలో పోలీసు బందోబస్తు నిర్వహణపై ఆ శాఖకు రూట్ మ్యాప్ అందించారు. పరీక్ష సమయంలో జిరాక్స్ సెంటర్లు మూసి వేయడంతోపాటు 300 మీటర్ల దూరంలో 144 సెక్షన్ అమలులో ఉంటుంది.

**15,475 మంది అభ్యర్థులు.. 54 సెంటర్లు**


గ్రూప్–4 పరీక్షకు జిల్లాలో 15,475 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. జిల్లాలోని 3 మున్సిపాలిటీ, 18 మండలాల పరిధిలో 54 సెంటర్లు ఏర్పాటు చేశారు. సెంటర్‌కు ఒక చీఫ్ సూపరింటెండెంట్ తోపాటు 810 మంది ఇన్విజిలేటర్లు, రూట్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్లు పనిచేయనున్నారు.

**ఉదయం, మధ్యాహ్నం పరీక్షలు..**

గ్రూప్–4 పరీక్షలో మొదటి పేపర్ జనరల్ స్టడీస్ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు రాయాల్సి ఉంటుంది. పేపర్–2(సెక్రెటేరియల్ ఎబిలిటీ/మ్యాత్స్ రిలేటెడ్) మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుంది. అభ్యర్థులను నిర్దేశిత సమయానికి గంట ముందు నుంచే సెంటర్లలోకి అనుమతిస్తారు. పరీక్ష సమయానికి 15 నిమిషాల ముందు గేట్లు మూసివేస్తారు. ఆ తర్వాత వచ్చిన అభ్యర్థులను లోనికి అనుమతించరు. హాల్ టికెట్‌తోపాటు ఆధార్ లేదా ఏదైనా గుర్తింపు కార్డును వెంట తెచ్చుకోవాలి. హాల్ టికెట్‌పై ఫొటో లేకుండా, ఇంకా ఏమైనా తప్పులు ఉంటే.. గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించి తీసుకురావాలి.

# నేడు ఆసిఫాబాద్‌కు కేసీఆర్

- సీఎం పర్యటనకు సర్వం సిద్ధం
- కొత్త కలెక్టరేట్, ఎస్పీ, బీఆర్‌ఎస్ కార్యాలయాలు ప్రారంభం
- ఇక్కడి నుంచే పోడు పట్టాల పంపిణీకి శ్రీకారం
- ఆసిఫాబాద్ పట్టణంలో భారీ బహిరంగ సభ



సిద్ధమైన సభా వేదిక

సాక్షి, ఆసిఫాబాద్: ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు కుమురంభీం జిల్లా పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. రెండు రోజులుగా రేయింబవళ్లు కష్టపడి జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు సర్వం సిద్ధం చేశారు. ఐదేళ్ల తర్వాత జిల్లాకు వస్తుండడంతో బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణుల్లో జోష్ నెలకొంది. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు ఆసిఫాబాద్‌కు రానున్న సీఎం కేసీఆర్ తొలుత కుమురంభీం చౌక్‌కు చేరుకుంటారు. అక్కడ కుమురంభీం విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. అక్కడి నుంచి బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయానికి చేరుకుని పూజలు నిర్వహించి ప్రారంభిస్తారు. తరువాత పక్కనే ఉన్న పిల్లల పార్కుకి వెళ్లి అక్కడ ఏర్పాటు చేసిన మాజీ మంత్రి కోట్నాక భీంరావు విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయానికి వెళ్లి ఆ భవనాన్ని ప్రారంభిస్తారు. అక్కడి నుంచి సమీకృత కలెక్టరేట్‌కు చేరుకుంటారు. అక్కడ పూజలు నిర్వహించి కలెక్టరేట్‌ను ప్రారంభిస్తారు. అనంతరం కలెక్టరేట్ సిబ్బందితో మాట్లాడుతారు. తరువాత కలెక్టరేట్‌లోనే దశాబ్దాలుగా పోడు భూములను సాగు చేస్తున్న గిరిజన రైతులకు పట్టాలు అందజేసే కార్యక్రమానికి శ్రీకారం చుడతారు. ఆసిఫాబాద్, సిర్పూర్ కాగజ్‌నగర్ నియోజకవర్గాలకు చెందిన 12 మంది గిరిజన రైతులకు హక్కుపత్రాలను అందజేస్తారు. అనంతరం సాయంత్రం 4 గంటలకు బహిరంగ సభాస్థలికి చేరుకుని ప్రజలనుద్దేశించి మాట్లాడుతారు.

**ఆరెకరాల్లో బహిరంగ సభ..**

సీఎం కేసీఆర్ పర్యటనకు జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లా జైలు సమీపంలోని ప్రేమలా గార్డెన్ వద్ద ఆరెకరాల్లో బహిరంగ సభకు కావాల్సిన ఏర్పాట్లన్నీ పూర్తి చేశారు. ముఖ్యమంత్రితోపాటు పార్టీ ముఖ్యనేతలందరూ కూర్చునేలా భారీ వేదిక సిద్ధం చేశారు. బీఆర్‌ఎస్ జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బాల్క సుమన్, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఎమ్మెల్సీ దండె విఠల్ తదితరులు పనులు పర్యవేక్షిస్తున్నారు. గ్రామ, మండల, పట్టణాల నుంచి భారీగా జనాన్ని తరలించేందుకు పార్టీ సర్పంచులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు సన్నద్ధమవుతున్నారు. వేదిక వద్ద మహిళల కోసం తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. సభకు వచ్చే ప్రజలకు తాగునీటి కోసం వాటర్ ప్యాకెట్లు, మజ్జిగ ప్యాకెట్లు సిద్ధం చేశారు. అలాగే వారికి భోజనాలు మూడు వేర్వేరు ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు.

### 2,300 మందితో బందోబస్తు..

సీఎం పర్యటనకు భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. డీఐజీ రమేశ్‌నాయుడు ఆధ్వర్యంలో ఆసిఫాబాద్ ఎస్పీ సురేశ్ కుమార్, పెద్దపల్లి డీసీపీ వైభవ్ గైక్వాడ్, కరీంనగర్ పీటీసీ ఎస్పీ అరవింద్‌తోపాటు 15 మంది అడిషనల్ ఎస్పీలు, 49 మంది సీఐలు, 159 మంది ఎస్సైలు, 12 మంది మహిళా ఎస్సైలు, 264మంది ఏఎస్సైలు, 1,100 మంది పీసీలు, 109మంది మహిళా పీసీలు, 200 మంది స్పెషల్‌పార్టీ సిబ్బంది, హోంగార్డులు, 300 మంది సీఎం సెక్యూరిటీ, స్పెషల్ స్క్వాడ్ సిబ్బందితో కలిసి మొత్తం 2,300 మందితో బందోబస్తు నిర్వహించనున్నారు.

### పర్యటన ఇలా..

**ఉదయం..**

10.55 : ప్రగతిభవన్ నుంచి బేగంపేట విమానశ్రయానికి చేరుకుంటారు.

11.00 : బేగంపేట విమానశ్రయం నుంచి హెలీక్యాప్టర్‌లో ఆసిఫాబాద్ బయల్దేరుతారు.

**మధ్యాహ్నం..**

12.05 : ఆసిఫాబాద్ జిల్లా సమీకృత కలెక్టరేట్‌లోని హెలీప్యాడ్‌కు చేరుకుంటారు.

12.15 : కుమురంభీం చౌక్‌లోని కుమురంభీం విగ్రహావిష్కరణ.

12.35 : బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తారు.

1.10 : పిల్లల పార్కులో ఏర్పాటు చేసిన మాజీ మంత్రి కోట్నాక భీంరావు విగ్రహావిష్కరణ.

1.30: పోలీసు కార్యాలయాన్ని ప్రారంభిస్తారు.

2.00: సమీకృత కలెక్టరేట్ సముదాయాన్ని ప్రారంభిస్తారు. పోడు రైతులకు పట్టాలు పంపిణీ చేస్తారు. అక్కడ భోజనం చేశాక కలెక్టరేట్ సిబ్బందితో సమావేశం నిర్వహిస్తారు.

4.00 : బహిరంగ సభ

**సాయంత్రం..**

5.00 : కలెక్టరేట్‌లోని హెలీప్యాడ్ వద్దకు చేరుకుని హెలీక్యాప్టర్‌లో హైదరాబాద్‌కు బయల్దేరుతారు.

6.15 : బేగంపేట విమానశ్రయానికి చేరుకుంటారు.

6.25 : బేగంపేట నుంచి ప్రగతిభవన్‌కు చేరుకుంటారు.




భాగ్యనగర్ చేపల మార్కెట్ ముందు రోడ్డపై నిలిచిన వాననీరు



బంగల్‌పేట్ ప్రధాన రహదారిపై గుంతలు పడ్డ రోడ్లలో ఆగి ఉన్న వర్షపు నీరు

ఈ ఫొటోల్లో కనిపిస్తున్న గతుకుల రోడ్లు.. ఎక్కడో మారుమూల గ్రామాలకు చెందినవి కాదు.. నిర్మల్ జిల్లా కేంద్రంలోని గల్లీ రోడ్లు. మున్సిపాలిటీ పరిధిలో ఏ గల్లీ చూసినా కాస్త అటూ ఇటుగా ఇదే పరిస్థితి. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నీరు రోడ్లపై గుంతల్లో నిలుస్తోంది. వాహనాల రాకపోకలతో గుంతలు మరింత పెద్దగా మారి ప్రయాణానికి ఇబ్బందిగా మారుతోంది. ప్రజల ఇబ్బందులు తొలగించాల్సిన బల్దియా అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్ నిర్మల్

## క్లుప్తంగా

### తప్పిన ప్రమాదం

నేరడిగొండ: మండలంలోని కుప్టి బ్రిడ్జి జాతీయ రహదారిపై గురువారం రాత్రి రెండు లారీలు ఢీకొనగా పెనుప్రమాదం తప్పింది. వివరాలు.. ఆదిలాబాద్ వైపు నుంచి రెండు లారీలు నిర్మల్ వైపు వెళ్తున్నాయి. కుప్టి బ్రిడ్జిపై ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి మరో లారీ ఢీకొట్టింది. దీంతో ఎవరికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కొంతసేపు రాకపోకలకు అంతరాయమేర్పడింది. పోలీసులు వచ్చి వాహనాలను రోడ్డు నుంచి పక్కకు తొలగించగా రాకపోకలు కొనసాగాయి.

### రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని బట్టిసావర్‌గాం శివారు ప్రాంతంలో జాతీయ రహదారి 44పై గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై సయ్యద్ ఈసాక్ అలీ తెలిపారు. ఆయన కథనం ప్రకారం... గురువారం మావల వైపు నుంచి భోరజ్ వైపు 40 ఏళ్ల వయస్సు గల వ్యక్తి నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఇదే క్రమంలో వెనక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో అతడు సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. గమనించిన బట్టిసావర్‌గాం వీఆర్‌ఏ రావుల పోతన్న పోలీసులకు సమాచారం అందించాడు. మృతుడి సంబంధికులుఉంటే మావల పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### పాముకాటుతో యువతి మృతి

బేల: మండలంలోని చంపెల్లి గ్రామానికి చెందిన కొరంగే గీతాంజలి(21) పాముకాటుతో మృతిచెందింది. పోలీసుల వివరాల ప్రకారం .. రోజువారీలా బుధవారం రాత్రి యువతి కొరంగే గీతాంజలి ఇంటి ప్రాంగణంలో కుటుంబ సభ్యులతో కలిసి నిద్రపోయింది. అర్ధరాత్రి దాటిన తర్వాత ఆమె ఎడమచేతి బొటవేలికి పాముకాటు వేసింది. గురువారం ఉదయం నిద్రలేచిన క్రమంలో ఆమె పక్కన పాము కనిపించడంతో కుటుంబ సభ్యులు వెంటనే గీతాంజలిని వైద్యం కోసం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. మృతురాలి తండ్రి కొరంగే సోనేరావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణకుమార్ తెలిపారు.

### యువకుడి అదృశ్యం

నిర్మల్ రూరల్: మండలంలోని అనంతపేట్ గ్రామానికి చెందినా దేశెట్టి నరేష్ అనే యువకుడు రెండు రోజుల నుంచి కనిపించడం లేదని కుటుంబ సభ్యులు గురువారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై చంద్రమోహన్ కథనం ప్రకారం... నరేష్ మంగళవారం జిల్లా కేంద్రానికి వెళ్లి చిట్టి డబ్బులు తీసుకొస్తానని చెప్పి ఇంట్లో నుంచి బయలుదేరాడు. రెండు రోజులైనా ఇంటికి రాలేదు. నరేష్ మొబైల్ సైతం స్విచ్ ఆఫ్ రావడంతో తండ్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపాడు.

### నర్సాపూర్‌లో మహిళ..

నర్సాపూర్(జి): మండల కేంద్రానికి చెందిన బొమ్మెన సంగీత (38) వివాహిత ఐదురోజులుగా కనిపించకపోవడంతో ఆమె భర్త బొమ్మెన శ్రీనివాస్ గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రవీందర్ తెలిపారు.


సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ మంచిర్యాలలో Flipkart Large లో పనిచేయుటకు Hub Incharge, Delivery Executives & టాటా ఏస్ వెహికిల్స్ కావలెను. సంప్ర: సెల్: 9052922226, 8639651495. [K-1219849]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462


# వ్యూహం అనుసరిస్తే విజయం మీదే..

- రేపే గ్రూప్–4 పరీక్ష...
- ఉమ్మడి జిల్లాలో పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి
- ఉద్యోగాలకు తీవ్ర పోటీ...
- ప్రశాంతంగా రాస్తే కొలువు సులువేనంటున్న నిపుణులు

**వివరాలు:**

పరీక్ష : జూలై 1న శనివారం
పేపర్ 1: ఉదయం 10:00 నుండి 12:30 వరకు
పేపర్ 2: మధ్యాహ్నం 2:30 నుండి 5:00 వరకు



నిర్మల్ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో చదువుకుంటున్న అభ్యర్థులు(ఫైల్)

నిర్మల్ ఖిల్లా: సాధారణ డిగ్రీ అర్హత గలిగిన జిల్లా స్థాయి పోస్టుల్లో అత్యంత కీలకమైనవి గ్రూప్–4 ఉద్యోగాలు. వీటి కోసం టీఎస్‌పీఎస్సీ ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి భారీ ఎత్తున దరఖాస్తులు వచ్చాయి. శనివారం నిర్వహించే గ్రూప్ 4 పరీక్షకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్ష ఉదయం పేపర్ 1, మధ్యాహ్నం పేపర్ 2 నిర్వహించనున్నారు. సరైన వ్యూహంతో పరీక్ష రాస్తే ప్రభుత్వ కొలువును ఈజీగాసాధించవచ్చని పోటీ పరీక్షల నిపుణులు పేర్కొంటున్నారు.

**8039 పోస్టుల భర్తీ...**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని 25 శాఖల్లోని మొత్తం 8,039 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌ను విడుదల చేయగా నిర్మల్ జిల్లాకు దాదాపు 200, రాష్ట్ర స్థాయి కోటాలో మరో 375 ఉద్యోగాలకు ఆయా శాఖల వారీగా పోటీపడే అవకాశం ఉంది. సాధారణ డిగ్రీ అర్హత కలిగిన ఈ గ్రూప్ 4 పరీక్షకు పీజీ, బీటెక్, ఎంటెక్, పీహెచ్‌డీ తదితర ఉన్నత చదువులు అభ్యసించిన అభ్యర్థులు సైతం దరఖాస్తు చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొట్టమొదటి సారిగా వెలువడిన గ్రూప్ 4 నోటిఫికేషన్‌కు తీవ్రమైన పోటీ నెలకొంది.

**గ్రూప్ 4 పరీక్ష ఇలా...**

గ్రూప్ 4 పరీక్ష రెండు పేపర్లుగా 300 మార్కులకు ఉంటుంది. పేపర్ 1 జనరల్ స్టడీస్ 150 మార్కులకు, పేపర్ 2 సెక్రటేరియట్ ఎబిలిటీస్ 150 మార్కులకు నిర్వహిస్తారు. పరీక్ష మొత్తం ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. ప్రతి పేపర్‌కు రెండున్నర గంటల సమయం ఉంటుంది. పరీక్షలో వచ్చిన మెరిట్ ప్రతిపాదికన రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయి మెరిట్ రూపొందించి అభ్యర్థులను ఉద్యోగాలకు ఎంపిక చేస్తారు.

**ఉమ్మడి జిల్లా వివరాలు...**

| జిల్లా | అభ్యర్థుల సంఖ్య | పరీక్షకేంద్రాల సంఖ్య | పరీక్ష కేంద్రాలు |
|---|---|---|---|
| నిర్మల్ | 15,475 | 54 | నిర్మల్, భైంసా, ఖానాపూర్ |
| ఆదిలాబాద్ | 17,771 | 54 | ఆదిలాబాద్, మావల, ఇచ్చోడ, బోథ్, ఉట్నూర్ |
| మంచిర్యాల | 27,801 | 94 | మంచిర్యాల, బెల్లంపల్లి, మందమర్రి, లక్సెట్టిపేట, నస్పూర్, జైపూర్ |
| కుమురంభీం | 8,251 | 33 | ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, వాంకిడి, సిర్పూర్(టి), రెబ్బెన |

### పరీక్షకు ముందు రోజు...

- పరీక్షకు ఒక రోజు ముందు అభ్యర్థులు సబ్జెక్టు ప్రిపరేషన్ కంటే పరీక్షకు హాజరయ్యేందుకు అవసరమైన వాటిని సిద్ధం చేసుకోవాలి. పరీక్షకు ఒక రోజు ముందు రాత్రి అభ్యర్థులు ప్రశాంతంగా నిద్రపోవాలి.
- పరీక్ష రోజున నిర్దేశిత సమయానికి ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి.
- కేటాయించిన స్థలం సరిచూసుకుని కూర్చున్న అనంతరం ఇచ్చిన ఓఎంఆర్ షీట్‌ని చెక్ చేసుకోవాలి.
- సమాధానాలను గుర్తించే ముందు ప్రశ్నాపత్రాన్ని ఒకటికి రెండుసార్లు పరిశీలించాలి.
- సులభమైన ప్రశ్నలతో ప్రారంభించి ఓ మోస్తారు కాఠిన్యత, ఆ తర్వాత మరింత కాఠిన్యత ఉన్న ప్రశ్నలకు సమాధానం గుర్తించాలి.
- తెలిసిన సమాధానాలకు గుర్తించిన తర్వాతనే ఎలిమినేషన్ విధానాన్ని, ఊహించి జవాబులు చేసే విధానాన్ని అనుసరించాలి.
- గ్రూప్ 4 మొదటి పేపర్ ముగిసిన తర్వాత రెండవ పేపర్ ప్రారంభానికి ముందు మధ్యాహ్నం రెండు గంటల వ్యవధి ఉంటుంది. ఈ సమయంలో అభ్యర్థులు మొదటి పేపర్లో గుర్తించిన సమాధానాల గురించి చర్చించడం వంటివి చేయడం కరెక్ట్ కాదు. దీంతో అదనపు ఒత్తిడి పెరుగుతుంది.

### ఒత్తిడికి గురికావొద్దు



పరీక్ష రోజున ఉదయం మొదటి, మధ్యాహ్నం రెండవ పేపర్ పరీక్ష నిర్వహిస్తారు. పరీక్ష సమయంలో అభ్యర్థులు ఒత్తిడికి లోను కావద్దు. తెలిసిన సమాధానాలు మొదటగా గుర్తించాలి. తెలియని సమాధానం వద్దే ఆగిపోకుండా దానిని వదిలేసి ముందుకు వెళ్లాలి. ఒకటి రెండు ప్రశ్నలకు సమాధానాలు తెలియకపోయినా ఆందోళన చెందవద్దు. రెండు పేపర్లలో ఎక్కువ మార్కులు సాధించేలా ప్రయత్నించాలి. – కటకం మురళి, అసిస్టెంట్ ప్రొఫెసర్, పోటీ పరీక్షల నిపుణులు, నిర్మల్

## కోర్టు ఆదేశాలు ధిక్కరించడం సరికాదు

- బీజేపీ పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి రావుల రాంనాథ్



మాట్లాడుతున్న రావులరాంనాథ్

సారంగాపూర్: చించోలి(బి) సమీపంలో నూతనంగా నిర్మించిన ప్రార్థన మందిరంలో గత రంజాన్ మాసంలో ఎలాంటి ప్రార్థనలు నిర్వహించొద్దని కోర్టు ఆదేశాలిచ్చిన సంగతి తెలిసిందే. అయితే దానికి విరుద్ధంగా బక్రీద్ సందర్భంగా ఓ వర్గం ప్రజలను సపోర్ట్ చేస్తూ ప్రార్థనలు చేయండని ఉసిగొలపడం రాష్ట్ర న్యాయశాఖమంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డికి సరికాదని బీజేపీ పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి రావుల రాంనాథ్ అన్నారు. మండలంలోని ఇప్పచెలిమ గ్రామంలో గురువారం పర్యటించిన ఆయన కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించిన అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. బక్రీద్ సందర్భంగా ఓ వర్గం ప్రజలు చించోలి(బి)వద్ద నిర్మించిన ఈద్గాకు ప్రార్థనల కోసం వస్తే అటవీశాఖ అధికారులు అడ్డుకున్నారన్నారు. వెంటనే మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అటవీశాఖ అధికారులను బెదిరించి పోలీసులను రక్షణగా పెట్టి ప్రార్థనలు చేసుకోమని చెప్పడం దారుణమన్నారు. న్యాయశాఖమంత్రిగా వ్యవహరిస్తూ కోర్టు ఆదేశాలకు వ్యతిరేకంగా నడుచుకోవడం సరికాదన్నారు. ఇది కేవలం ఓటు బ్యాంకు రాజకీయమని ఆరోపించారు. నిజానికి ఈద్గా నిర్మించిన స్థలం గతంలో యువత వృత్తి నైపుణ్యతా శిక్షణా కేంద్రానికి కేటాయించగా ఇలా అడ్డదారిలో ఈద్గాను నిర్మించారని దుయ్యబట్టారు. కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ఓ వర్గాన్ని రెచ్చగొట్టి అడ్డదారిలో అధికారం సంపాదించుకోవడం కోసమేనని ఆరోపించారు. అందుకే ప్రజలు ఈ విషయం గుర్తుంచుకుని రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు తగిన బుద్ధిచెప్పి అందరికీ సమన్యాయం చేసి బీజేపీని ఆదరించాలని కోరారు. బీజేపీ మండల అధ్యక్షుడు కరిపె విలాస్, బీజేవైఎం రాష్ట్ర స్టడీ సర్కిల్ కన్వీనర్ వెంకటేష్, గిరిజన మోర్చా మండల అధ్యక్షుడు రాథోడ్ వినోద్, బీజేవైఎం మండల అధ్యక్షుడు అఖిల్, కార్యవర్గ సభ్యుడు ఉమేష్, పోలింగ్ బూత్ అధ్యక్షుడు గణపతి ఉన్నారు.

# పండుగపూట విషాదం

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి



సమీరుద్దీన్ (ఫైల్)



జీహాన్ (ఫైల్)





ఘటన స్థలంలో క్షతగాత్రులు

కడెం: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతితో కడెం మండల కేంద్రంలో విషాదం నెలకొంది. ఎస్సై కొసన రాజు వివరాల ప్రకారం... దస్తురాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న కడెంకు చెందిన షఫీవొద్దీన్‌కు ఇద్దరు కుమారులు, కూతురు. పెద్ద కుమారుడు సయ్యద్ సమీరుద్దిన్ (19) హైదరాబాద్‌లో బీటెక్ చదువుతున్నాడు. పండుగ కోసం సొంతూరికి వచ్చాడు. అలాగే మండల కేంద్రానికి చెందిన చికెన్ సెంటర్ వ్యాపారి జహీర్‌కు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. రెండో కుమారుడు జీహాన్(20) నిర్మల్ జిల్లా కేంద్రంలో పాలిటెక్నిక్ చదువుతున్నాడు. ఇద్దరు చిన్ననాటి నుంచి స్నేహితులు కావడంతో బక్రీద్ పండుగ సందర్భంగా బైక్‌పై కడెం నుంచి చిన్నబెల్లాల్ సమీపంలోని గోదావరి వంతెన వద్దకు వెళ్తున్నారు. పెద్ద బెల్లాల్ గ్రామ సమీపంలోని చెరువు కట్ట మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకుల తలకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని స్థానికులు ఖానాపూర్ ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లే క్రమంలో సమీరుద్దిన్ మృతి చెందాడు. జీహాన్ నిర్మల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## గిరిజన మహిళను హత్య చేసిన నిందితుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగేందర్

ఉట్నూర్‌రూరల్: భిక్షాటన చేసి బస్‌షెల్టర్‌లో తలదాచుకున్న గిరిజన మహిళను అత్యాచారం చేసి ఆపై హత్య చేసిన ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కి తరలించినట్లు ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ తెలిపారు. గురువారం డీఎస్పీ కార్యాలయంలో కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఇంద్రవెల్లి మండలంలోని ధనోర–బి గ్రామంలో గిరిజన మహిళ (35) ఈ నెల 20న భిక్షాటన చేసి రోడ్డు పక్కన ఉన్న బస్ షెల్టర్‌లో రాత్రి పడుకుంది. ధనోర –బి గ్రామానికి చెందిన సుముక్‌రావు సంతోశ్, పసారే సంతోశ్, షేక్ ఖదీర్ ముగ్గురు కూడా గిరిజన మహిళపై అదే రాత్రి అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ విషయం గ్రామస్తులకు ఎక్కడ చెప్తుతుందోనని హత్య చేసి గ్రామానికి సమీపంలోని వ్యవసాయ బావిలో పడేశారు. ఈ ఘటన జరిగిన నాలుగు రోజుల తర్వాత ఆ వైపు వెళ్లిన గ్రామస్తులు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు తెలియజేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ నిమిత్తం నార్నూర్ సీఐ ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో ఇంద్రవెల్లి ఎస్సై సునీల్‌తో పాటుగా నాలుగు బృందాలుగా ఏర్పడి విచారణ ముమ్మరం చేశారు. గ్రామానికి చెందిన వ్యక్తులే అత్యాచారం చేసి హత్య చేసినట్లు నిర్ధారణ అయింది. వారిని రెండు రోజుల్లో పట్టుకుని అత్యాచారం, హత్య, ఎస్సీ, ఎస్టీ చట్టాల కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సమావేశంలో నార్నూర్ సీఐ ప్రేంకుమార్, ఇంద్రవెల్లి, ఉట్నూర్ ఎస్సైలు సునీల్, భరత్ సుమన్ ఉన్నారు.

## పాఠశాల భవనమే క్రీడా ప్రాంగణమట...




గ్రామీణ ప్రాంతాల యువతను క్రీడాకారులుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతీ గ్రామానికి క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేయాలని ఆదేశించింది. అయితే అధికారుల నిర్లక్ష్యంతో ఆ నిర్ణయం జిల్లాలో అభాసుపాలవుతోంది. బేల మండలం దుబ్బగూడ పంచాయతీ పరిధిలోని సాహెలితాండలో పాఠశాల భవనానికి ఎదుట తెలంగాణ క్రీడా ప్రాంగణమని బోర్డును ఏర్పాటు చేసి అధికారులు చేతులు దులుపుకున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

# భైంసాతెరపై ప్రేమలొల్లి

- సినిమాతీసింది మనోడే
- సామాజిక మాధ్యమాలతోనే వైరల్
- గతంలో పదికిపైగా షార్ట్ ఫిల్మ్స్



సినిమా క్లాప్ కొడుతున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

భైంసా: భైంసా పట్టణంలో నివాసం ఉంటున్న కొత్తూర్ శంకర్ ప్రేమలొల్లిపేరిట తీసిని సినిమా వెండితెరపై ప్రదర్శించనున్నాడు. శుక్రవారమే భైంసాలోని కమలా థియేటర్‌లో ఈ సినిమా రిలీజ్‌కానుంది. పదేళ్లుగా సినిమా తీయాలనే ఆలోచనతో పనిచేసిన కొత్తూర్ శంకర్ తన కల నెరవేర్చుకున్నాడు. రూ.10లక్షలు ఖర్చుచేసి ఈ సినిమా తీశాడు. కుభీర్ మండలం పార్డి గ్రామానికి చెందిన శంకర్ వ్యవసాయ కుటుంబంలో పుట్టి హైదరాబాద్‌లో ఎంఏ బీఈడీ పూర్తి చేశాడు. పదేళ్లకుపైగా సినిమాతీసేందుకు కష్టపడ్డాడు. అందరి సహకారంతో ఈ సినిమా పూర్తిచేసి భైంసా టాకీస్‌లో ప్రదర్శించునున్నాడు.

**గతంలో షార్ట్ మూవీలు...**

కొత్తూర్ శంకర్ పది వరకు షార్ట్ మూవీలు తీశాడు. భారీ హంగామా లేకుండా కోట్ల ఖర్చుపెట్టకుండా, షెడ్యులువేయకుండా చుట్టూ పరిసరాలు, నిత్యం చూస్తున్న అంశాలు, ఎదురయ్యే సమస్యలతో షార్ట్ ఫిల్మ్ రూపొందించేవాడు. వాటికి సోషల్ మీడియాలో సైతం మంచి ఆదారణ లభించింది. భైంసాలోని గందం శ్రీనివాస్ సలహాలు, సూచనలతో పాటు అన్ని విధాల ప్రొత్సహించాడు.

**రెండేళ్లు కష్టపడి...**

వెండితెరపై సినిమా చూపించాలనే తపనతో శంకర్ రెండేళ్లుగా కష్టపడ్డాడు. డబ్బులు లేకపోయినా రూ.10లక్షలతో ఈ సినిమా పూర్తిచేశాడు. మహారాష్ట్రలోని నాందేడ్ ప్రాంతానికి చెందిన ఉజయ్, పూజలను హీరో, హీరోయిన్‌లు ఎంచుకున్నాడు. ఈ ఇద్దరు ముంబై సినీ రంగంలో పనిచేశారు. భైంసా చుట్టూ ఉండే మరికొందరిని ఈ సినిమాలో నటించేలా పాత్రలు ఇచ్చాడు. అన్ని అనుమతులు వచ్చాక శుక్రవారం నుంయి ఈ సినిమా ప్రదర్శించనున్నాడు.

**అందరిని కలుస్తూ...**

ప్రేమలొల్లి సినిమాను విజయవంతం చేయాలని కొత్తూర్ శంకర్ అందరిని కలుస్తున్నాడు. భైంసాలో ఉండే కొత్తూర్ శంకర్ రెండు నెలలుగా సోషల్ మీడియా వేదికగా సినిమాను ప్రచారం చేస్తున్నాడు. ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామారావుపటేల్, మోహన్‌రావుపటేల్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్నతో పాటు పలువురు వ్యాపారస్తులు, ఆయా రంగాల్లో పనిచేసేవారు, వివిధ సంఘాలు, యువకులను కలుస్తూ తన సినిమాను ఆదరించాలని కోరుతున్నాడు.

### నా కల నెరవేరింది

చిన్నప్పటి నుంచి సినిమా తీయాలని ఉండేది. సినిమా తీసేందుకు ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఎదురయ్యాయి. గతంలో షార్ట్ ఫిల్మ్ తీశాను. సోషల్ మీడియాలో మంచి ఆదారణ లభించింది. నేను తీసిన ప్రేమలొల్లి శుక్రవారం నుంచి భైంసా టాకీస్‌లో నాలుగు ఆటలు ప్రదర్శన కానుంది. ఈ సినిమా విజయవంతమైతే నా ఆశయం నెరవేరుతుంది. భైంసా పరిసర ప్రాంతాల్లోనే షూటింగ్ పూర్తిచేశాను.

– కొత్తూర్ శంకర్



సినిమా షూటింగ్‌లో కొత్తూర్ శంకర్




ప్రేమలొల్లి సినిమా పోస్టర్



ఆటోలో ప్రచారం

## ఎట్టకేలకు సమగ్ర శిక్ష అభియాన్ పోస్టుల భర్తీ

- ఉత్తర్వులు జారీ చేసిన ఎస్‌పీడీ
- అభ్యర్థుల్లో వ్యక్తమవుతున్న ఆనందోత్సాహాలు

| జిల్లా | ఎంఐఎస్ కోఆర్డీనేటర్ | డీఈవో | సిస్టం అనాలిస్ట్ | ఏపీవో | ఐఈఆర్పీ |
|---|---|---|---|---|---|
| ఆదిలాబాద్ | 05 | 07 | 00 | 01 | 11 |
| నిర్మల్ | 08 | 07 | 01 | 01 | 14 |
| మంచిర్యాల | 06 | 05 | 01 | 01 | 10 |
| ఆసిఫాబాద్ | 05 | 03 | – | 01 | 14 |

ఆదిలాబాద్‌టౌన్: విద్యాశాఖలో పెండింగ్‌లోని సమగ్రశిక్షా అభియాన్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం ఎట్టకేలకు అనుమతిచ్చింది. ఈ మేరకు సమగ్ర శిక్షా అభియాన్ రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. డాటా ఎంట్రీ ఆపరేటర్, సిస్టం ఎనాలసిస్ట్, ఎంఐఎస్ కో ఆర్డీనేటర్, అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్, ఇంక్లూసివ్ ఎడ్యూకేషన్ రిసోర్స్ పర్సన్ పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిన భర్తీ చేసేందుకు ప్రభుత్వం 2019 నవంబర్‌లో నోటిఫికేషన్ జారీ చేసింది. అప్పట్లో దరఖాస్తులు స్వీకరించి రాత పరీక్ష కూడా నిర్వహించారు. మెరిట్ జాబితాను సైతం ప్రకటించారు. రాష్ట్ర విద్యాశాఖ అనివార్య కారణాలతో ఈ నియమాక ప్రక్రియను నిలిపివేసింది. దీంతో ఉమ్మడి జిల్లా పరిధిలోని ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ పోస్టులు ఎప్పుడు భర్తీ అవుతాయా అని గంపెడాశతో ఎదురుచూస్తున్నారు. వారి నిరీక్షణకు తెరదించుతూ ఎస్పీడీ దేవసేన భర్తీకి అనుమతినిచ్చింది. ఈ నెల 30 నుంచి జూలై 13 వరకు ఈ ప్రక్రియ కొనసాగనుంది. గతంలో ఎంపికై నిరీక్షిస్తున్న వారిలో ఆనందోత్సాహాలు వ్యక్తమవుతున్నాయి.

**నేటి నుంచి ప్రక్రియ షురూ**

ఆర్ఎంఎస్ఏ ద్వారా భర్తీ చేయనున్న ఈ పోస్టుల నియమాక ప్రక్రియ శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ నెల 13వరకు ప్రక్రియ నిర్వహిస్తారు. 30న డీఈఓ, ఎంఈఓ కార్యాలయాల్లో మెరిట్ జాబితా, జూలై 1న సినియార్టీ జాబితా ప్రకటన, 3న ప్రొవిజనల్ లిస్టు ప్రకటన, 4, 5 తేదీల్లో అభ్యర్థుల నుంచి అభ్యంతరాల స్వీకరణ, 7న కేటగిరీ వారీగా తుది జాబితా విడుదల , 10న సర్టిఫికేట్ల పరిశీలన, నియమాక పత్రాలను అందజేయనున్నారు. ఎంపికైన అభ్యర్థులు 13వ తేదీలోగా సంబంధిత పోస్టుల్లో చేరాల్సి ఉంటుంది.